క్లుప్తంగా

రాజరాజ నరేంద్ర స్వామికి నిత్య కల్యాణం



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాల త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామికి కార్తిక మాసం పురస్కరించుకుని నిత్య కల్యాణం నిర్వహిస్తున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేస్తున్నట్లు అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ తెలిపారు. ప్రతి నిత్యం తెల్లవారుజామున ఏకాదశ రుద్రాభిషేకం, నవ హారతులు, సాయంత్రం శాంతి కల్యాణం, ప్రతి సోమవారం పౌర్ణమి పర్వ దినాల్లో ఉదయం ప్రత్యేకంగా కల్యాణం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలు దేవాలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, చైర్మన్ జంపని అంజయ్యల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

గోగులమ్మకు ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామదేవత గోగులమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని సహస్ర దీపాలంకరణ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు దీవి గోపి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సనాతన ధర్మం వర్ధిల్లాలి



కర్లపాలెం: సృష్టి ఉన్నంత వరకు సనాతన ధర్మం వర్ధిల్లాలని శ్రీగిరి విద్యాపీఠం తెనాలి పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి బాలస్వామి అన్నారు. స్థానిక రామకృష్ణా సేవా సమితిలో ఆదివారం సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ పరమాత్ముని దృష్టిలో అందరూ సమానమని, పరమాత్ముని చేరటానికి, ముక్తి పొందటానికి భగవనామస్మరణే శరణ్యమని తెలిపారు. హిందూ ధర్మంలోని సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. అనంతరం కర్లపాలెంలో శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమరసత రాష్ట్ర కన్వీనర్ వేముల సుబ్బారావు, సహాయ కన్వీనర్ జ్వాలా నరసింహం, అంకమ్మ చౌదరి, విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, నరసింహరావు, సురేష్, వెంకటేశ్వర్లు, శంకర్ రావు, సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

అలరించిన ఘంటసాల స్వర నీరాజనం



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆవరణలో శ్రీ శుభాంజలి కళా వేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘంటసాల స్వరనీరాజనం పేరుతో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. కార్యక్రమాన్ని సంస్థ మహిళా కార్యదర్శి ధనలక్ష్మీకుమారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు గాయకులు మేకల పురుషోత్తమప్రసాద్, పత్రి గాయత్రి, పావని, రజనీ యుగళ గీతాలు, సోలో గీతాలు 116కు పైగా ఆలపించారు. అనంతరం కళాసాధ అధ్యక్షుడు బిళ్లా అశోక్‌ను సత్కరించారు. కాపునాడు అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, మిరియాల ప్రసాదరావు, కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, వెంకాయమ్మ, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, యర్రగోపు నాగేశ్వరరావు, దేవ సహాయం, ఆచారి, కళాకారుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు. వ్యాఖ్యాతలుగా దొప్పలపూడి శ్రీనివాసరావు, చీకటి రవికాంత్, పెల్లూరి కృష్ణారావు వ్యవహరించారు. కార్యక్రమాన్ని సంస్థ గౌరవాధ్యక్షుడు సిరిగిరి గణేష్, ఎన్నుబర్ల బ్రహ్మం, కమలికంటి వలి, తుమ్మేటి శ్రీనివాసరావు, శివయ్య నిర్వహించారు.

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 4వ లైనులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.17,500 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్ణశోభితం.. విజ్ఞాన భాండాగారం



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ముగ్గుల పోటీలో పాల్గొన్న బాలికలు



కొల్లూరు గ్రంథాలయంలో..



మెహందీ పోటీలలో పాల్గొన్న వలంటీర్లు, మహిళలు

భట్టిప్రోలు: మాటూరు రామారావు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 35 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా మెడతాటి భవానీ వ్యవహరించారు. వెన్నెల, ఎ. హాసిని ప్రియ, కె. మహాలక్ష్మి, సీనియర్స్ విభాగంలో అల్లం జాహ్నవి, నందం సేవిక, కరిశెట్టి హేమ నాగమణి, బూర్లె ప్రవల్లిక విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారికి సోమవారం నిర్వహించనున్న ముగింపు వేడుకలలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ తెలిపారు. మహిళా పోలీస్ తిరుమల దిశ చట్టం, మహిళా సాధికారతపై వివరించారు. దిశ చట్టం, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బాలికలకు ముగ్గుల పోటీలు

కర్లపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలో భాగంగా ఆదివారం కర్లపాలెం శాఖ గ్రంథాలయంలో బాలికలకు ముగ్గు లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించారు. పోటీలను పర్యవేక్షించిన గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ మాట్లాడుతూ విజేతలకు వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలలో పలు పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రంథాయాలతో విద్యార్థులకు మేలు..

కొల్లూరు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నట్లయితే విద్యార్థులకు ఎనలేని మేలు చేకూరుతుందని కొల్లూరు ఏఎస్‌ఐ రామయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పునస్కరించుకుని ఆదివారం కొల్లూరు, అనంతవరం శాఖ గ్రంథాలయాలలో విద్యార్థులకు ముగ్గులు, జాతీయ గీతల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాలకు క్రమం తప్పకుండా వెళుతూ, పుస్తక పఠనం చేసిన క్రమంలో భవిష్యత్తులో పోటీ పరీక్షలలో రాణించడానికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధి జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు వై. రాంబాబు, జి. కనకదుర్గ పాల్గొన్నారు.

యడ్లపల్లిలో మెహందీ పోటీలు

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం యడ్లపల్లి గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్ర పటానికి లైబ్రేరియన్ బి. గిరిజా సుందరి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వలంటీర్లు, మహిళలకు మెహిందీ పోటీలు నిర్వహించారు.

వైభవంగా రథం నిర్మాణ పనులు ప్రారంభం



రథం నిర్మాణానికి కలపను తీసుకొస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి దంపతులు

బాపట్ల: బాపట్ల పట్టణంలో వేంచేసియున్న భావన్నారాయణస్వామి దేవాలయంలో రథం నిర్మాణ పనులు అత్యంత వైభవంగా ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, సతీమణి రమాదేవి రథానికి సంబంధించిన టేకు కలపను తీసుకొచ్చారు. నూతనంగా నిర్మించిన రథశాలలో వాటిని ఉంచారు. దేవాలయం అర్చకులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, తన్నీరు అంకమ్మరావు, బుల్లిరెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే నాగేంద్రపురంలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. వేదపండితుల ప్రత్యేక పూజలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలేరమ్మకి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు.

అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, గౌరీశంకర్‌కు సత్కారం

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ హైస్కూలులో 1977–78 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆత్మీయ పలకరింపులతో ఒకరినొకరు పలకరించుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, కోడె గౌరీశంకర్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమగ్ర సర్వశిక్షాభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి, గుంటూరు డిప్యూటీ డీఈవో వీసం వెంకటేశ్వర్లు, నిర్వాహకులు ఉమామహేశ్వరరావు, వేముల రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న సిబ్బంది

అద్దేపల్లి(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఈనిగ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సిబ్బంది అద్దేపల్లిలో రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోధుమలు, మినుములు, పెసలు, శనగలు, బొబ్బర్లు, ఉలవలు, 6 రకాల విత్తనాలు సిద్ధం చేసుకుని ముందుగా నువ్వులను 12 గంటల ముందు నానబెట్టాలని, మిగిలిన విత్తనాలను 12 గంటల తర్వాత మొత్తం పలుచని గుడ్డలో వడ గట్టి వాటిని గుడ్డలో మూట కట్టి భూమిలో పాతాలని తెలిపారు. రెండు రోజుల తర్వాత మొలకలొచ్చిన విత్తనాలను మెత్తగా రుబ్బి 10 లీటర్ల ఆవు మూత్రంలో కలిపి 12 గంటలు పులియబెట్టాలని చెప్పారు. ఈ ద్రావణాన్ని ఒక ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. దీని వల్ల గింజ బరువు పెరగడమే కాకతాలు గింజలు రావని, కిరణజన్య సంయోగ క్రియ బాగా జరిగి మొక్కలకు అన్ని పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీఎలు, ఐసీ ఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఓం నమఃశివాయ.. ఓం నమఃశివాయ



శివ లింగాకారంలో కోటి ఒత్తులతో కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కళకళలాడింది. కార్తిక మాస పూజలు చేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తొలుత ఆలయం ఎదురుగా ఉన్న యజ్ఞాల బావి వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, పొంగళ్లు పొంగించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం చుట్టూ ఓం నమఃశివాయ నామం స్మరిస్తూ భక్తులు పొంగళ్లు నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణలు చేశారు. ప్రాకార మండపంలో ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన టేబుళ్ల పైనా, చెట్ల కింద భక్తులు దీపారాధనలు చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ప్రభలతో తరలివచ్చిన భక్తులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అధికంగా అంత్రాలయ అభిషేకాలు, దర్శనాలు, తలనీలాలు సమర్పణ, అన్నప్రాసనలు, నామకరణలు, వాహనపూజలు అధిక సంఖ్యలో జరిగాయి. సాయంత్రం అర్చకులు ప్రత్యేక పూజలు అనంతరం ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో శివ లింగాకారంలో పుష్పాలతో అలంకరించి, కోటి వత్తులతో కార్తిక దీపాలు వెలిగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక్కరోజులో స్వామికి పలు సేవా కార్యక్రమాలు, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాల ద్వారా రూ. 6,65,900 ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. విద్యార్థుల వందేమాతరం ప్రార్థన గీతంతో పోటీల్ని ప్రారంభించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు భారతమాత చిత్రానికి రంగులు వేయడం, వేమన పద్యాలు, ఏకపాత్రాభినయం పోటీల్ని నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

పూరిళ్లు దగ్ధం



నగరం: అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు, వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలోని పెదపలిగొల్లపాలెంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలతో పెదపల్లి గొల్లపాలెం గ్రామానికి చెందిన మోర్ల శివసుందరావు, మోర్ల నాగరాజు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో పాటు ప్రక్కనే ఉన్న ఏమినేని రామారావుకు చెందిన వరిగడ్డివామికి మంటలు వ్యాపించడంతో అగ్నికి ఆహుతయ్యింది. అగ్ని ప్రమాద సిబ్బందికి సమాచారం తెలపడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు అంచనావేశారు.

నేడు అన్నదానం

భట్టిప్రోలు: పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని గుత్తావారిపాలెంలో కార్తిక మాసం మొదటి సోమవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం సందర్భంగా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని రామాలయం అయ్యప్ప స్వామి సేవా సమితి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, సకల దీక్షా పరులు, భక్తులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

డాక్టర్ వీర రాఘవయ్యకు పరామర్శ

రేపల్లె: పట్టణానికి చెందిన పిల్లల వైద్యుడు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ వసంతం వీర రాఘవయ్య అనారోగ్యానికిగురై ఇటీవల కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ఆదివారం ఆయనను పరామర్శించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కార్తిక పౌర్ణమికి ఏర్పాట్లు సిద్ధం

డీఎస్పీ వెంకటేశులు

బాపట్ల టౌన్: కార్తిక పౌర్ణమికి అన్ని ఏర్పాట్లు చేశామని డీఎస్పీ వెంకటేశులు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు మేరకు ఆదివారం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లో పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సముద్రంలో లోతుకు వెళ్లకుండా రంగుల జెండాలను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసు హెచ్చరికలను పాటించాలని సూచించారు. డీఎస్పీతో పాటు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సైలు ఉన్నారు.

రైల్వే స్టేషన్‌లో బాలల వారోత్సవాలు



లక్ష్మీపురం: రైల్వేస్టేషన్లలో ఒంటరిగా ప్రయాణించే బాలలు, దారి తప్పిన బాలలకు అవగాహన కల్పించి వారి సంరక్షణ కోసం రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటాయని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ సమీర్, ఆర్పీఎఫ్ సీఐ రవీంద్రనాథ్ తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం బాలల వారోత్సవాల్ని రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్లలో ఒంటరిగా సంచరిస్తున్న వారు, దారి తప్పిన బాలలు, తల్లిదండ్రులపై అలిగి వచ్చిన వారిని గుర్తించి టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం బాలల భద్రతపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ భాజన్, జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటటాద్రి, ఆర్పీఎఫ్ ఎస్ఐ వనిత, రైల్వే చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్లు, సంస్థ సభ్యులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమైక్యతను చాటే వన సమారాధన

మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



పూజలో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున

ఐలవరం(భట్టిప్రోలు): కార్తిక మాసం పురస్కరించుకుని గ్రామస్తులందరూ సమైఖ్యతను చాటే విధంగా కులమతాలకతీతంగా వన సమారాధన నిర్వహించుకోవడం అభినందనీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. ఐలవరంలో కొలువైన బాల త్రిపుర సందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్తులు సంఘటితంగా ఉండి తోటి వారికి సహాయపడే విధంగా ఉండాలని కోరారు. ప్రశాంతమైన గ్రామీణ వాతావరణంలో కార్తిక వన సమారాధన ఏర్పాటు చేయడంతో నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, గ్రామంలోని వివిధ కులాల సంఘీయులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో మంత్రి నాగార్జున పాల్గొన్నారు. పలువురు దంపతులు సత్యన్నారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

పిట్టలవానిపాలెం: మండలంలోని మంతెనవారిపాలెం గ్రామంలో ఈ నెల 20న ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామ సచివాలయం వద్ద నవరత్నాలు లబ్ధిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు.

నేడు ఓలేరులో..

భట్టిప్రోలు: ఓలేరు సచివాలయంలో సోమవారం సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం కూడా జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ఎంపీటీసీ సభ్యులు నీలా సాంబమ్మ, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

దహన వాటిక ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు

అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లి హిందూ మహాప్రస్థానం అభివృద్ధికి ఆ ప్రాంత వాసులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు (బీఎస్సాఆర్) ఆదివారం మహా ప్రస్థానంలో రూ. 2.50 లక్షల వ్యయంతో దహన వాటిక ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. గతంలో గ్రామానికి చెందిన బీఎస్సార్‌తో పాటు పలువురు సంఘీయులు అస్థికలు భద్రపరచుకునేందుకు రూ. 2 లక్షల వ్యయంతో ఓ గదిని నిర్మించారు. ప్రస్తుతం ఈ మహా ప్రస్థానానికి ప్రాకారం ఏర్పడిందని, అలాగే రహదారి సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పిస్తే బాగుంటుందని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొన్నిపాటి వెంకటేశ్వరరావు, శనగపల్లి శ్రీనివాస ప్రసాద గుప్తా, కాశేపల్లి శ్రీనివాసరావు, మద్దుల సాంబశివరావు, డొక్కు సాయి, కుందేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్‌ను ఉప సంహరించుకోవాలి



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

భట్టిప్రోలు: కృష్ణా జలాల పునః పంపిణీలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను తక్షణమే ఉప సంహరించుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు జి. బాలాజి, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బందారు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో ఈ నెల 20, 21 తేదీలలో సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించ తలపెట్టిన 30 గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో ఏపీకి అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు చేనేత కార్మికుల ఆందోళన



మాట్లాడుతున్న ఐక్య కార్యచరణ సమితి నాయకులు

భట్టిప్రోలు: చేనేత కార్మికుల మజూరీలను పెంచాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఆధ్వర్యంలో సోమవారం భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నట్లు సమితి నిర్వాహకులు పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో సమితి నాయకులు ఎం. సత్యన్నారాయణ, ఎం. వెంకట్రావు, జి. బాలాజిలు మాట్లాడుతూ పాత రేపల్లె తాలూకా పరిధిలోని చేనేత కార్మికుల మజూరీలు పెంచి రెండేళ్లు కావస్తోందన్నారు. మంగళగిరిలో పెంచిన విధంగా ఇక్కడ కూడా మజూరీలు పెంచాలని కోరారు. అక్కడ నూటికి 15 శాతం మజూరీలు పెంచారని పేర్కొన్నారు. సోమవారం జరిగే ధర్నాలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు దొంతు శ్రీనివాసరావు, బి. నాగమల్లేశ్వరరావు, కె. మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తిక వన సమారాధన



అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు

రేపల్లె రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పేటేరు బావాజీతోటలో అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో శ్రీ షిరిడి సాయిబాబా సేవాశ్రమము ఆధ్వర్యంలో సాయి కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయి చాలీసా, సాయినామ పారాయణగావించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేశారు. కార్యక్రమంలో సేవాశ్రమ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం, కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న విశ్రాంత ఆంధ్రోపన్యాసకుడు నారాయణం శేషు, శ్రీహరి అన్నయ్య శాస్త్రి, నారాయణం శరత్ చంద్‌లను సత్కరించారు. అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి పీఎస్‌బీ శర్మ, కోశాధికారి రొంపిచర్ల విజయ సారధి, సీవీ మోహనరావు, కొండవీటి అగస్త్యశాస్త్రి, చావలి త్రయంబక శర్మ, అగ్నిహోత్రం సీతారామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.